Andhra Jyothi 06/02/14



# పూర్తిగా సహకరిస్తాం

## జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులకు ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం హామీ



నగర అధికారులతో సమావేశమైన ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం

ఆంధ్రజ్యోతి , హైదరాబాద్ సిటీ: హైధరాబాద్ నగరం ఇంతగా విస్తరిస్తుందని మొదట్లో ఎవరూ ఊహించలేదు. భవిష్యత్తులో ఇంకెంత విస్తరిస్తుందో కూడా ఎవరూ చెప్పలేని పరిస్థితి. అందుకే, నగరం భావి అవసరాల దృష్ట్యా మెట్రోరైలు, ఎంఎంటీఎస్, జాతీయ రహదారులు, రేడియల్ రోడ్లు.. అన్నింటినీ విస్తరించాలని హెచ్ఎండీఏ తలపెట్టింది. ఇందుకోసం కాంప్రహెన్సివ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్(సీటీఎస్) పేరుతో ఒక ప్రణాళికను గతంలోనే సిద్ధం చేసింది. ఈ ప్రణాళికకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(యూఎంటీఏ) ఆమోదముద్ర వేసింది. ఈ ప్రణాళికకు ఏడాదికి రూ. 5వేల కోట్ల ఖర్చవుతుంది. వీటన్నింటితో పాటు వాటర్‌బోర్డుకు చెందిన తాగునీరు, మురుగునీటి ప్రాజెక్టులు, జీహెచ్ఎంసీకి చెందిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు కూడా రాబోయే 5-7 ఏళ్లలో రూ. 17వేల కోట్లతో రానున్నాయి.

### వరల్డ్ బ్యాంకు నిపుణులతో ..

ఈ మొత్తం ప్రణాళికకు భారీ మొత్తంలో నిధులు అవసరం కావడంతో వరల్డ్‌బ్యాంక్ నిపుణులు మూడు రోజులుగా నగరంలో పర్యటిస్తున్నారు. హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ సోమేష్‌కుమార్, హెచ్ఎండీఏ కమిషనర్ ఎన్‌కే ప్రసాద్, వాటర్‌బోర్డు ఎండీ శ్యామలరావు, ఇతర సీనియర్ అధికారులతో భేటీ అవుతున్నారు. ప్రపంచబ్యాంకు బృందంలో నలుగురు సభ్యులున్నారు. వారు నట్వర్ గాంధీ, కేశవ్ వర్మ, ఆంథోనీ పెల్లెగ్రిని, సుజాతా శ్రీకుమార్. వీరిలో నట్వర్‌గాంధీ అంతర్జాతీయ ఆర్థిక నిపుణుడు. అమెరికా ఆర్థిక వ్యవస్థ మిగులులోకి రావడానికి ఆయనే కారణం. ఇక కేశవ్ వర్మ అహ్మదాబాద్ కార్పొరేషన్‌లో మౌలిక సదుపాయాలకు ఆర్థిక వనరులు సమకూర్చారు. 1990లలో ఆ నగరానికి కమిషనర్‌గా ఉన్నారు. పలు నగరాలకు మార్గదర్శకత్వం వహించడం, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆర్థికవనరులు సమకూర్చడంలో ఆంథోనీ పెల్లెగ్రిని, సుజాతా శశికుమార్ పేరెన్నికగన్నవారు.

మెట్రోరైలు ప్రాజెక్టును ఈ బృందం నిశితంగా పరిశీలించింది. అనంతరం కొత్త ప్రాజెక్టులకు కావల్సిన నిధులు, ఇతర అవస్థరాలపై ఉన్నతాధికారులతో చర్చించింది. హైదరాబాద్‌లోని మెట్రోరైలు, ఔటర్ రింగ్‌రోడ్డు లాంటి సదుపాయాలు చూసి అంతర్జాతీయంగా అనేక పెట్టుబడులు ఇక్కడకు రావడం ఖాయమని బృంద సభ్యులు విశ్వాసం వ్యక్తం చేశారు. అ నంతరం నిపుణుల బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.కె. మొహంతిని కలిసింది. నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యకలాపాలపై ఆయన వద్ద సంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్ర ఖజానాపై భారం పడకుండా అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో పీపీపీ విధానంలో పెట్టుబడులు తెచ్చేందుకు తాము పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఆయనకు సభ్యులు తెలిపారు.

Andhra prabha 06/02/14



మెట్రో పనులు పరిశీలించిన

# నిపుణుల బృందం

మెట్రో పనుల గురించి బృందానికి వివరిస్తున్న ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

వివరాలు 7లో

## మెట్రో పనులను పరిశీలించిన వరల్డ్ బ్యాంక్ ఎక్స్‌పర్ట్ టీం

**హైదరాబాద్, ఫిబ్రువరి 25 (కెఎన్ఎన్ ప్రతినిధి)** వరల్డ్ బ్యాంకుకు చెందిన నలుగురు సభ్యులతో కూడిన నిపుణుల బృందం బుధవారం మెట్రోరైల్ పనులను పరిశీలించింది. ఈ సందర్భంగా మెట్రో పనుల పురోగతిని వారికి ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్. రెడ్డి వివరించారు.

పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) కింద తలపెట్టిన అతి పెద్ద ప్రాజెక్టు దేశంలో ఇదే అని వరల్డ్‌బ్యాంకు ప్రతినిధుల బృందానికి ఆయన వివరించారు. మెట్రో కు నిర్మిస్తున్న పిల్లర్ల నిర్మాణం చూసి వారు మెట్రో ఎండిని అభినందించారు. అనంతరం మెట్రో భవన్‌లో గ్రేటర్ కమిషనర్ సోమేష్‌కుమార్, హెచ్ఎండిఏ కమిషనర్ నీరబ్ కుమార్ ప్రసాద్, మెట్రో వాటర్ వర్క్స్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జె. శ్యామలరావుతో పాటు ఇతర ఉన్నతాధికారులతో వరల్డ్‌బ్యాంకు నిపుణల బృందం భేటి అయింది. మెట్రో రాక నగర శివారుల్లో పెట్టుబడులు పెద్దమొత్తంలో రానున్నాయని ప్రతినిధుల బృందానికి ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. ముఖ్యంగా హెచ్ఎండిఏ రూపొందించిన సీటీఎస్ (సమగ్ర రవాణ వ్యవస్థ)ను యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ (యుఎంటిఏ) నుంచి ఆమోదం లభించిందని అన్నారు. తద్వారా ఆరువేల కోట్ల రూపాయల పెట్టుబడులు నగర శివారుల్లో వచ్చే అవకాశముందని తెలిపారు. భవిష్యత్తులో నగర శివారుల్లో మెట్రో, ఎంటిఎస్, హైవేలు, రేడియల్ రోడ్ల కోసం రానున్న ఆరేడు సంవత్సరాల్లో కనీసం 1700 కోట్ల రూపాయలను కనీస సౌకర్యాలపై గ్రేటర్ వెచ్చించనుందని ఆయన తెలిపారు. మెట్రోను సందర్శించిన నిపుణుల కమిటిలో నట్వర్ గాంధీ, కేశవ వర్మ, ఆంటోనీ పెల్లిగ్రిని, సుజాతా శ్రీకుమార్ తదితరులు ఉన్నారు. అనంతరం వారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.కె. మహంతితో సమావేశమయ్యారు.

Sakshi

Dt: 06/02/14

# మెట్రో పనులు భేష్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో జరుగుతున్న ఎలివేటెడ్ మెట్రో పనులను ప్రపంచ బ్యాంకు బృందం ప్రశంసించింది. బుధవారం బ్యాంకు ప్రతినిధులు నట్వర్ గాంధీ, కేశవ్ వర్మ, ఆంథోని తదితరులు మెట్రో పనులను పరిశీలించారు. పనుల తీరును హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వారికి వివరించారు. నగర పునర్నిర్మాణానికి ఈ ప్రాజెక్టు దోహదం చేస్తుందని బృందం సభ్యులు కొనియాడారు. నగరంలో సమగ్ర రవాణా ప్రణాళిక (సీటీఎస్) అమలుకు ఏటా రూ.5 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిన నేపథ్యంలో ప్రపంచ బ్యాంకు బృందం మెట్రో పనులను పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నిధులతో భవిష్యత్‌లో నగరంలో పలు రూట్లలో ఎంఎంటీఎస్, మెట్రో మార్గాలను విస్తరించే అవకాశాలున్నట్లు హెచ్ఎంఆర్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

Surya

Dt 06/02/14

# వరల్డ్‌బ్యాంక్ కితాబు

**హెచ్‌ఎంఆర్ పనులను పరిశీలించిన ప్రతినిధులు**

**ఫండింగ్ చేసేందుకు సిద్ధమంటున్న అధికారులు**

ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో వస్తున్న హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు పనులు పరిశీలించిన వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మూడు రోజులుగా నగరంలో పర్యటిస్తున్న వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు బుధవారం హెచ్‌ఎంఆర్ కాస్టింగ్ యార్డ్‌ను సందర్శించారు. హెచ్‌ఎంఆర్ ఎండి ఎన్.వి.ఎస్. రెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో తీసుకుంటున్న జాగ్రత్తలతో పాటు అధునాతన పద్ధతుల ద్వారా ప్రాజెక్టు పనితీరును క్షుణ్ణంగా వివరించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న సమగ్ర రవాణా వ్యవస్థలో హెచ్‌ఎంఆర్ రానున్న రోజుల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వరల్డ్‌బ్యాంక్ సిఎఫ్ఓ గాంధీ(వాషింగ్టన్), ప్రతినిధులు కేశవ్‌వర్మ, ఆంటోని, సుజాతలు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ మార్కెట్ ద్వారా హెచ్‌ఎంఆర్‌కు ఫండింగ్ వచ్చేవిధంగా తమవంతు తోడ్పాటు అందిస్తామని తెలిపారు.

-మేజర్‌న్యూస్, సిటీబ్యూరో

